క్లుప్తంగా

నేడు ఉపాధి హామీ 'ఓపెన్ ఫోరం'

మర్పల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10గంటలకు ఉపాధి హామీ పథకం 14వ విడం సామాజిక తనిఖీల్లో భాగంగా ఓపెన్ ఫోరం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజ్ మల్లయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు సంవత్సరాలుగా గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులు, కూలీల పని దినాలు, చెల్లింపులు తదితర వాటిపై ఈ నెల 13 నుంచి 23వ తేదీ సామాజిక తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఓపెన్ ఫోరం కార్యక్రమానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది పూర్తి సమాచారంతో రావాలని సూచించారు.

రైతు రుణమాఫీ అమలు చేయాలి

కొడంగల్ రూరల్: సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు వెంటనే రైతు రుణమాఫీ అమలు చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి కె.చంద్రప్ప మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రుణమాఫీ చేస్తామని ప్రకటించి గాలికొదిలేశారని ఆరోపించారు. రైతులు వివిధ బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను ప్రభుత్వం వెంటనే మాఫీ చేయాలని ఆయన కోరారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి



నస్కల్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ పద్మమ్మ

పరిగి: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పద్మమ్మ సూచించారు. మంగళవారం మండలంలోని నస్కల్ గ్రామంలో కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. ఈ పథకం పేదలకు వరమన్నారు. కార్యక్రమంలో రైతుబంధు అధ్యక్షుడు రాజేందర్, కార్యదర్శి ఫారుఖ్ హుస్సేన్, కంటి వైద్య నిపుణులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన



పొలం బాట పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ తదితరులు

అనంతగిరి: వికారాబాద్ మండలం రాళ్ల చిట్టంపల్లిలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను మంగళవారం ఎంపీడీఓ సత్తయ్య పరిశీలించారు. పొలాల మధ్య వేస్తున్న రోడ్డు పనులను ఆయన పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. పొలం బాటలతో రైతులకు పంట రవాణా కష్టాలు తీరుతాయన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయమే పనులు చేసుకోవాలని కూలీలకు సూచించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఈసీ ప్రతిభ, పంచాయతీ కార్యదర్శి ప్రతిభ పాల్గొన్నారు.

అన్నదానం.. మహా పుణ్యకార్యం



హనుమాన్ ఆలయంలో అన్నదానం చేస్తున్న నర్సింహులు తదితరులు

పరిగి: మండలంలోని కళ్లాపూర్‌లో వెలసిన లొంక హనుమాన్ ఆలయంలో మంగళవారం విశ్రాంత డీపీఆర్ఓ నర్సింహులు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. అన్నదానం మహాపుణ్య కార్యం అని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని సూచించారు.

ఆర్థిక సాయం



పెళ్లి కానుకలు అందజేస్తున్న సర్పంచ్ శాంతిబాయి

కుల్కచర్ల: పేదింటి ఆడపిల్లల వివాహాలకు తమ వంతు సహకారం ఉంటుందని పటేల్ చెరువు తండా సర్పంచ్ శాంతీబాయి అన్నారు. మంగళవారం మండలంలోని కిచ్చన్నకుంట తండాకు చెందిన తులసీబాయి, పెంట్యానాయక్ దంపతుల కూతురు మనిషా వివాహానికి రూ. 10వేల నగదు, వంట సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాము, లింగ్యా, గఫూర్, మాణిక్ పవర్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకానికి ప్రోత్సాహం

- యూనిట్ విలువ రూ. 3.48లక్షలు
- కనీసం ఎకరా భూమి, నీటి వసతి అవసరం
- ఈజీఎస్‌లో దరఖాస్తు చేసుకుంటే చాలు..
- చేప పిల్లలు కూడా ఉచితంగానే..
- చిన్న, సన్నకారు రైతులకు ప్రయోజనం

బషీరాబాద్: ఉపాధి హామీ పథకం ద్వారా చేపల పెంపకానికి శ్రీకారం చుడుతున్నారు. ఇందులో భాగంగా ఫిష్ పాండ్స్ నిర్మిస్తున్నారు. ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు ఉన్న చిన్న, సన్న మత్స్యకారు రైతుల ఆర్థిక అభివృద్ధి కోసం ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. అయితే రైతుకు కనీసం ఒక ఎకరం భూమి, బోరు మోటారు లేదా నీటి వసతి ఉండాలి. అప్పుడే ఈ పథకాన్ని పొందవచ్చు. అలాగే రైతు సంఘాలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. నీటి కాలువల పక్కన ప్రభుత్వ భూములు ఉంటే ఆ భూముల్లో ఉపాధి హామీ అధికారులు చేపల గుంతలు తవ్వించి ఇస్తారు. రైతులు ఆయా గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులకు కానీ, ఉపాధి కార్యాలయంలో గానీ దరఖాస్తు చేసుకోవచ్చు. దీని కోసం ఉపాధి హామీ పథకం కింద రూ. 3.48లక్షలు ఖర్చు చేయనున్నారు. చేపల పాండ్స్ నిర్మాణం తర్వాత బోరుబావుల ద్వారా కానీ, సాగునీటి కాలువల ద్వారా కానీ నీటిని వదులుతారు. అందుకు తగినట్లు ఏర్పాట్లు చేస్తారు. ఇప్పుడు దరఖాస్తు చేసుకుంటే జూన్ మాసం వరకు నిర్మాణాలు పూర్తి చేసి రైతులకు అప్పగిస్తారు. వర్షాకాలం ప్రారంభమయ్యాక ప్రభుత్వం మత్స్యశాఖ నుంచి ఈ రైతులకు ఉచితంగానే చేపలను అందిస్తుంది. అయితే చేపలు పెంచుకునే సదరు రైతులు మత్స్యశాఖ నుంచి సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుంది.



ఫిష్ పాండ్ (ఇన్‌సెట్‌లో) చేపలు

నిర్మాణం ఇలా..

చేపలను పెంచేందుకు నిర్మించాల్సిన ఫిష్ పాండ్స్(చేపల గుంతలు) పొడవు 25 మీటర్లు, అడ్డం 25 మీటర్లు, లోతు రెండు మీటర్లు ఉండేలా తవ్వుతారు. ఇలా ఒకదాని పక్కన ఒకటి నాలుగు గుంతలను తవ్వుతారు. ఒక దాని నుంచి మరో పాండ్ లోకి నీళ్లు వెళ్లేలా ఏర్పాట్లు చేస్తారు. చేపలు పెంపకం కోసం తవ్విన పాండ్స్‌ల్లో నిరంతరం నీరు ఉండేల జాగ్రత్త వహించాల్సి ఉంటుంది.

దరఖాస్తు చేసుకోండిలా

చేపల చెరువులను పొందేందుకు సదరు రైతు జాబ్‌కార్డు కలిగి ఉండాలి. అలాగే పట్టా భూమి పాసుపుస్తకం జిరాక్స్, జాబ్‌కార్డు జిరాక్స్ ఇవ్వాలి. ఒకరు లేదా గ్రూపుగా కూడా మత్స్యకారు రైతులు ధరఖాస్తు చేసుకోవచ్చు. పంచాయతీలో కానీ, ఉపాధి హామీ కార్యాలయంలో కానీ ధరఖాస్తు చేసుకోవాలి. నిర్మాణ స్థలం పరిశీలించిన అనంతరం ఉపాధి హామీ అధికారులు ఆన్‌లైన్‌లో టెక్నికల్‌గా మంజూరు కోసం అప్‌లోడ్ చేస్తారు.

ఉచితంగా చేప పిల్లలు

చేపల చెరువులు ఉన్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తుంది. మత్స్యశాఖ ఆధ్వర్యంలో వర్షాకాలంలో చెరువుల్లో చేపలను వదులుతుంది. ఫిష్ పాండ్స్ నిర్మించుకోవడానికి ఇదే మంచి సమయమని అధికారులు సూచిస్తున్నారు.

సెంట్రల్ లైటింగ్‌కు మోక్షం లేదా?

ధారూరు: మండల కేంద్రంలోని 16వ కిలోమీటర్ నుంచి 17.5 కిలోమీటర్ వరకు 20 మీటర్ల వెడల్పు ఫోర్‌లైన్ రోడ్డును నిర్మించడానికి నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది. తాండూర్ – హైదరాబాద్ ప్రధాన రోడ్డు కావడం, సెంట్రల్ లైటింగ్‌తో ధారూరుకు శోభ ఇస్తుందని అప్పట్లో అందరు భావించారు. ఒకటిన్నర మీటర్ల డివైడర్‌లో సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేయడానికి 2018లో రూ. కోటి మంజూరయ్యాయి. కేవలం రోడ్డు వేసి సెంట్రల్ లైటింగ్ సిస్టంకు మంగళం పాడారు. ఈ విషయమై అధికారులను ప్రశ్నిస్తే నిధులు లేవని, మంజూరు కాగానే పనులు చేపడతామని చెబుతున్నారు. మంజూరైన కోటి రూపాయలు ఏమయ్యాయనే ప్రశ్న అందరిలోను మొదలైంది. నిధులు మంజూరు కాకుండానే ప్రజా ప్రతినిధులు గొప్పల కోసం చెప్పారా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.



సెంట్రల్ లైటింగ్‌కు నోచుకోని రోడ్డు

ఇకనైనా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని అసంపూర్తి పనులతో పాటు సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేయించాలని ప్రజలు కోరారు.

ఎమ్మెల్యే సహకారంతో గ్రామాభివృద్ధి

తాండూరు రూరల్: ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి సహకారంతో గౌతపూర్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నట్లు సర్పంచ్ రాజప్పగౌడ్ తెలిపారు. గ్రామంలో జరుగుతున్న మురుగు కాల్వల నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గౌతపూర్ అభివృద్ధికి ఎమ్మెల్యే రూ. 47లక్షలు మంజూరు చేశారని చెప్పారు. ప్రధాన కూడళ్లలో హైమాస్ట్ లైట్లు, సీసీ కెమెరా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, పంచాయతీ పాలకవర్గం మహేష్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మురుగు కాలువ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ రాజప్పగౌడ్

ప్రభుత్వ ప్రోత్సాహంతో లాభాల్లోకి..



మల్కాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మనోహర్‌రెడ్డి

డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి

కుల్కచర్ల: నష్టాల్లో ఉన్న పీఏసీఎస్‌కు ప్రభుత్వ ప్రోత్సాహం లభించడంతో లాభాల్లోకి వెళ్లిందని డీసీసీబీ చైర్మన్ బీ మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ముక్తవెంకటాపూర్‌లో రైతులకు కుల్కచర్ల పీఏసీఎస్ ఆధ్వర్యంలో గోడ గడియారాలు పంపిణీ చేశారు. అనంతరం మల్కాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి సహకార సంఘం ఎంతో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాందాస్ నాయక్, పీఏసీఎస్ సీఈఓ బక్కారెడ్డి, వైస్ చైర్మన్ నాగరాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ కొండయ్య, నాయకులు నర్సింలు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వేళాపాలా లేని విద్యుత్ కోతలు

ధారూరు: మండల కేంద్రంలో వేళాపాలా లేని విద్యుత్ కోతలు అమలవుతున్నాయి. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం 4:42 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేశారు. ఆదివారం అర్ధ రాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు కరెంట్ కట్ చేశారు. అసలే ఎండాకాలంలో ఆపై విద్యుత్ కోతలతో వినియోగదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. చిన్నపాటి గాలి వీచిన, చినుకు పడినా సరఫరా ఆగిపోతోంది. వారం రోజుల నుంచి నిత్యం గంటల తరబడి అంతరాయం కలుగుతోంది. రాత్రి పూట సరఫరా లేకపోవడంతో జాగారం చేయాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు దోమల స్వైర విహారం చేస్తున్నాయని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ధారూరు ప్రజలు కోరుతున్నారు.

ఎన్టీఆర్ హయాంలోనే బడుగులకు మేలు



మినీ మహానాడుతో మాట్లాడుతున్న కాసాని వీరేశ్

టీ టీడీపీ రాష్ట్ర నాయకుడు కాసాని వీరేశ్

పరిగి: దివంగత సీఎం ఎన్టీఆర్ హయాంలోనే బడుగులకు మేలు జరిగిందని, పేదల కోసం అనేక పథకాలు అమలు చేశారని టీ టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి జోత్స్న, రాష్ట్ర కన్వీనర్ కాసాని వీరేశ్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం పరిగిలోని శారద గార్డెన్‌లో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చంద్రయ్య అధ్యక్షత మినీ మహానాడు నిర్వహించారు. ఎన్టీఆర్‌కు భారత రత్న ఇవ్వాలని, రాష్ట్రంలోని నిరుద్యోగులకు న్యాయం చేయాలని, అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తీర్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందడం లేదన్నారు. రాష్ట్రం మొత్తం అన్యాక్రాంతం అవుతోందని ఆరోపించారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐలయ్య, తెలుగు యువత అధ్యక్షుడు జయరాం, మహిళా అధ్యక్షురాలు షకీలారెడ్డి, రాష్ట్ర నాయకులు చంద్రహాస్, రాఘు, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రామేశ్వర్‌రావు, మాణిక్యం పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



బషీరాబాద్: కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జేపీఎస్‌లు



కొడంగల్ రూరల్: ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీఆర్‌ఏలు, జేపీఎస్‌లు

బషీరాబాద్: జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మంగళవారం వారు బషీరాబాద్‌లో సీఎం కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. ఇచ్చిన హామీని సీఎం కేసీఆర్ నిలబెట్టుకున్నారని తెలిపారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..

కొడంగల్ రూరల్: సీఎం కేసీఆర్ చిత్రపటానికి వీఆర్ఏలు, పంచాయతీ జూనియర్ కార్యదర్శులు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. జేపీఎస్, వీఆర్ఏలను రెగ్యులర్ చేస్తామని క్యాబినెట్‌లో ప్రకటించడంతో పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీఆర్ఏలకు, జేపీఎస్‌లకు స్వీట్లు తినిపించారు. కార్యక్రమంలో వీఆర్ఏ జేఏసీ జిల్లా చైర్మన్ గోపాల్, వీఆర్ఏలు శ్రీనివాస్, సంధ్యారాణి, ఆంజనేయులు, మోహన్, నర్సింలు, ప్రవీణ్, బాబు, వెంకటయ్య, రమేష్, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రీ సైక్లింగ్‌తో పర్యావరణానికి ప్రయోజనం

వికారాబాద్ అర్బన్: ఇళ్లలోని పొడి చెత్తను రీ సైక్లింగ్ చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రయోజనం చేకూరుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ సీ మంజుల తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఆర్‌ఆర్‌ఆర్ మేరా లైఫ్ మేరా స్వచ్ఛ షెహర్ కార్యక్రమంలో భాగంగా రీ సైక్లింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశం మేరకు ప్లాస్టిక్ వస్తువులను రీసైక్లింగ్ చేయడంలో భాగంగా ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణ ప్రజలు తమ ఇళ్లలోని పొడి చెత్త(ప్లాస్టిక్ బాటిల్స్, పాత బట్టలు, పాత చెప్పులు, పాత పుస్తకాలు వంటి వాటిని ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌కు తెచ్చి రీ సైక్లింగ్ చేసుకోవాలని సూచించారు. పట్టణంలోని గాంధీ పార్క్‌తోపాటు 23వ వార్డు ఆలంపల్లిలో కూడా ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ రెండు సెంటర్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర, టీపీఓ శ్రీధర్, మెప్మా వెంకటేష్ పాల్గొన్నారు.



వికారాబాద్ అర్బన్: ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌కు పాత పుస్తకాలు అందజేస్తున్న మంజుల



కొడంగల్ రూరల్: ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌కుమార్

ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలి

కొడంగల్ రూరల్: రెడ్యూస్, రీ యూజ్, రీ సైక్లింగ్(ఆర్‌ఆర్‌ఆర్) సెంటర్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌పై అవగాహన కల్పించారు. ప్రజలు వార్డుల వారీగా తమ ఇళ్లలో ఉన్న పాత సామగ్రి, దుస్తులు, పుస్తకాలు, సీసాలు తదితర వస్తువులను బయట పడేయకుండా రీ యూజ్, రెడ్యూజ్, రీసైక్లింగ్ బిన్‌లలో వేయాలని తెలిపారు. ఈ కేంద్రాలు ఉదయం 7నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తారని తెలిపారు. వార్డు స్వచ్ఛత, పరిశుభ్రత కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. క్లీన్ లైన్స్ డ్రైవ్‌లో భాగంగా జూన్ నెల 5వ తేదీ వరకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. వార్డు ఆఫీసర్లు ప్రజలకు అవగాహన కల్పించి స్వచ్ఛత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మేనేజర్ గిరిజ, ఇన్విరాలల్ మెంటల్ ఇంజనీర్ భరత్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కొనసాగుతున్న జాతర

తాండూరు రూరల్: మండలంలోని కోత్లాపూర్‌లో రేణుకఎల్లమ్మ జాతర కొనసాగుతోంది. నెల రోజుల పాటు సాగే ఈ జాతరకు కర్ణాటకతో పాటు తెలంగాణ నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. జూన్ 4వ తేదీ వరకు జాతర కొనసాగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ సందీప్‌రెడ్డి తెలిపారు.

విధిగా హెల్మెట్ ధరించాలి

తాండూరు రూరల్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కరన్‌కోట్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి సూచించారు. మంగళవారం రాత్రి గౌతపూర్ వద్ద వాహనదారులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల బారిన పడి ఏటా పెద్ద సంఖ్యలో వాహనదారులు చనిపోతున్నారని చెప్పారు. హెల్మెట్ ధరిస్తే ప్రాణప్రాయం నుంచి తప్పించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ -2 విమల, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో కలశ పూజ



కలశానికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

తాండూరు రూరల్: మండలంలోని చెన్గేస్‌పూర్ అనుబంధ గ్రామం కోనాపూర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో కలశ పూజ నిర్వహించారు. మంగళవారం గర్భగుడిపై కలశాన్ని ప్రతిష్ఠింపజేశారు. అంతకుముందు ఆలయంలో గణపతి పూజ, హోమం, అర్చన, అభిషేకం నిర్వహించారు.

కాంగ్రెస్ బలోపేతానికి శ్రమించాలి

దోమ: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎం విజయ్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని దాదాపూర్ గ్రామ అధ్యక్షుడిగా శేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు గోవర్దన్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు మొగులయ్య, సర్పంచ్ వెంకటయ్య, గురుగౌడ్, రాయులు గౌడ్, అనంతయ్య, రమేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పరిగిలో మోస్తరు వర్షం



రోడ్డుపై చెట్టు పడడంతో ఆగిన వాహనాలు

పరిగి: మండలంలో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. ఈదురు గాలులు, వడగండ్ల వర్షం కురవడంతో ఆయా గ్రామాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యింది. రుకుంపల్లి, నస్కల్ గ్రామాల మధ్యలో ఈదురు గాలులకు చెట్లు విరిగి రోడ్లపై పడ్డాయి. దీంతో పరిగి – వికారాబాద్ రాకపోకలు గంట పాటు అంతరాయం ఏర్పడింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని జేసీబీ సాయంతో రోడ్ల పడిన చెట్లను తొలగించారు.

పంట నష్ట పరిహారం ఇవ్వండి

బంట్వారం: వడగళ్ల వానకు పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం నాయకుడు అజీమ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు బంట్వారం మండలంలో వివిధ రకాల పంటలకు తీవ్రనష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం కంటి తుడుపు చర్యలతో సరిపెట్టాలని చూస్తోందని ఆరోపించారు. నష్టాన్ని సరిగ్గా అంచనా వేసి ఎకరాకు రూ. 50వేల చొప్పున చెల్లించాలన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఇన్‌పుట్ సబ్సిడీ వచ్చేదని, తెలంగాణ ప్రభుత్వంలో అలాంటి పరిస్థితి లేదన్నారు. పంట నష్టపోయిన రైతులందరికీ సత్వరమే పరిహారం ఇవ్వాలన్నారు. లేకుంటే అన్నదాతలకు అండగా ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్

తాండూరు రూరల్: మండలంలోని కోటబాసుపల్లిలో మంగళవారం పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల వద్ద గల మురుగు కాలువలను శుభ్రం చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వర్షాకాలం ముందే గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని తెలిపారు.



మురుగు కాలువను శుభ్రం చేస్తున్న సిబ్బంది

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

బొంరాస్‌పేట: దుద్యాల మండలం హకీంపేట జెడ్పీహెచ్ఎస్‌లో 2008–09 బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం (పూర్వ విద్యార్థుల సమ్మేళనం) నిర్వహించారు. వారికి చదువు చెప్పిన గురువులను సన్మానించారు. ఆటపాటలతో పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. కుటుంబ సమేతంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.